

పింఛనో రామచంద్ర

గతంలో నిరంతర ప్రక్రియ

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కొత్త పెన్షన్లు, రేషన్ కార్డుల మంజూరు వంటివి నిరంతర ప్రక్రియగా కొనసాగేవి. వలంటీర్లు ఇంటి వద్దకే వెళ్లి అర్హులను గుర్తించి వారి వివరాలు సచివాలయాలకు అందజేసేవారు. దరఖాస్తులు చేయించి ఆన్‌లైన్‌లో పొందుపరచి, ఎటువంటి ఇబ్బందులు లేకుండా పెన్షన్లు, రేషన్ కార్డులు అందజేసేవారు. ప్రస్తుతం ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. దీంతో అర్హత ఉన్న వారంతా సచివాలయాలకు వెళ్లి సిబ్బందిని ప్రశ్నిస్తున్నారు.

పెదగంట్యాడ: కొత్త పెన్షన్ల కోసం పండుటాకులు.. వితంతువులు ఎదురు చూస్తున్నారు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా ఆ దిశగా కార్యాచరణ లేదు. ఇంత వరకూ వెబ్‌సైట్ కూడా అందుబాటులోకి రాకపోవడంతో అర్హులంతా కొత్త పెన్షన్ కోసం నిరీక్షిస్తున్నారు. నిత్యం సచివాలయాల చుట్టూ కాళ్లరిగేలా ప్రదక్షిణలు చేస్తున్నారు. వృద్ధాప్య, వితంతు పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఎదురు చూస్తున్నారు. సచివాలయానికి వెళ్లిన వారికి ఇంకా సైట్ ఓపెన్ కాలేదంటూ సిబ్బంది చెప్పడంతో అదేంటి గతేడాది నుంచి ఇలానే చెబుతున్నారని అడిగితే .. మేమేం చేస్తాం.. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు.

గత ప్రభుత్వ హయాంలో..

చాలా మంది వృద్ధులు, వితంతువులు ప్రభుత్వం అందజేసే పింఛన్లే ప్రధాన ఆధారంగా బతుకున్నారు. దీంతో గత వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే వారికి పింఛన్లు అందజేసింది. మొదటి మూడు సంవత్సరాల పాటు ప్రతి మూడు నెలలకోసారి కొత్త పింఛన్లు మంజూరు చేసేది. 2023–24లో ప్రతి ఆరు నెలలకోసారి పింఛన్ లబ్ధిదారులను గుర్తించేవారు. వారికి పింఛన్లు మంజూరు చేసే వారు. 2024 జనవరిలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో చివరిసారిగా పింఛన్లు అందజేశారు. తర్వాత ఎన్నికల కోడ్ అమల్లోకిరావడంతో కొత్త పింఛన్ల మంజూరు ప్రక్రియ నిలిచిపోయింది. 2024 ఏప్రిల్‌లో నిలిచిపోయిన వెబ్‌సైట్ ఇప్పటి వరకూ తెరుచుకోలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం 15 నెలలుగా కొత్త పెన్షన్లు మంజూరు చేయకపోవడతో అర్హులంతా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

అరకొరగా స్పౌజ్ పింఛన్లు..

వృద్ధాప్య పింఛన్ తీసుకునే వారు చనిపోతే స్పౌజ్ కేటగిరీ కింద (భార్య, భర్తకు) పింఛన్ ఇస్తున్నారు. ఇది కూడా నాలుగునెలలుగా అందజేస్తున్నారు. అంతకు ముందు చనిపోయి సంవత్సరం దాటిన వారికి ఇంకా పింఛన్ అందడం లేదు. పింఛన్ తీసుకోని కుటుంబాల్లో 60 ఏళ్ల దాటినా.. భర్త చనిపోయినా ప్రస్తుతం పింఛన్ ఇవ్వడం లేదు. దీంతో అర్హులు ఆవేదన చెందుతున్నారు.

50 ఏళ్లకే పింఛన్ హామీ ఏమైంది?

ఎన్నికల ముందు బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారికి 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామంటూ కూటమి నాయకులు ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చి 15 నెలలు అవుతున్నా ఆ హామీని ఇంకా నెరవేర్చలేదు. ఇప్పటి వరకూ వెబ్‌సైట్ ఓపెన్ చేయకపోడంతో అర్హులంతా అసహనం వ్యక్తం చేస్తున్నారు.

వెబ్‌సైట్ ఓపెన్ చేయాలి..



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా కొత్త పెన్షన్లు మంజూరు చేయడానికి చర్య లు చేపట్టడం లేదు. సచివాలయానికి వెళ్తే వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదని చెబుతున్నారు. ప్రభుత్వ పెద్దలు స్పందించి వెంటనే వెబ్‌సైట్ ఓపెన్ చేసి దరఖాస్తులు స్వీకరించి పెన్షన్లు మంజూరు చేయాలి.

– కొయ్య భారతి, మాజీ కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ గాజువాక మున్సిపల్ వింగ్ ప్రెసిడెంట్.

50 ఏళ్లకే పింఛన్ అందజేయాలి



ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 50 ఏళ్లకే పెన్షన్‌ను వెంటనే అమలు చేయాలి. అర్హత ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలను ఆదుకోవాలి. అంతేకాకుండా చేతి వృత్తులు చేసే వారికి కూడా ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయం అందడం లేదు. ప్రభుత్వం స్పందించి అందరికీ న్యాయం చేయాలి.

– రోజారాణి, వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు

అర్హులను ఆదుకోవాలి



అర్హత ఉన్న వృద్ధులు, వితంతువులకు కొత్త పెన్షన్లు మంజూరు చేసి ఆదుకోవాలి. వృద్ధులు, వికలాంగులు పింఛన్లపైనే ఆధారపడి ఉంటారు. వారికి ప్రతి నెలా పింఛన్ ఇవ్వాలి. ఈ ప్రక్రియను నిరంతరం కొనసాగించాలి. ఆర్నెల్లకోసారైన కొత్త పెన్షన్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలి.

– ఒమ్మి ఈశ్వరి, దయాల్‌నగర్,,

ఏడాదిన్నరగా ఎదురుచూస్తున్నా

గత ఏడాది ఏప్రిల్‌లో నాభర్త చనిపోయాడు. జీవనాధారం కోల్పోయాను. వితంతు పింఛను కోసం దరఖాస్తు చేసుకుందామని సచివాలయానికి వెళితే.. ఇంకా సైట్ ఓపెన్ కాలేదని చెబుతున్నారు. ఇప్పటికి సుమారు 60 సార్లు వెళ్లాను. ఎన్నిసార్లు వెళ్లినా అదే చెబుతున్నారు.పింఛన్ అందజేస్తే జీవనానికి ఉపయోగపడతాయి. ప్రభుత్వ పెద్దలు మాలాంటి వాళ్లను దృష్టిలో పెట్టుకుని పింఛన్ మంజూరు చేయాలి..

– ఎస్. లక్ష్మి, వితంతువు, పెదగంట్యాడ

ఆదర్శప్రాయురాలు అచ్చియ్యమ్మ



అచ్చియమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు

పెదగంట్యాడ: పెదకోరాడ గ్రామానికి చెందిన సమాజ సేవకురాలు బసా అచ్చియమ్మ అకాల మరణం బాధాకరమని మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, చింతలపూడి వెంకటరామయ్య అన్నారు. కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు సంతాప సభలో వారు పాల్గొని అచ్చియమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇంటక్ జాతీయ నాయకుడు మంత్రి రాజశేఖర్, నాయకులు గొందేశి వెంకటరమణారెడ్డి, గొందేశి మహేశ్వరరెడ్డి, మార్టుపూడి పరదేశి, యొల్లి చిన్న, మంత్రి శంకరనారాయణ, ధర్మాల వెంకటరమణ, నక్క వెంకటరమణ తదితరులు నివాళులర్పించారు.

నిత్యావసర సరకుల అందజేత



రెండు కుటుంబాలకు నిత్యావసర సరకులు అందిస్తున్న సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి నిర్వాసితకాలనీ పెదమకకు చెందిన సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 65 మంది నిరుపేద వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పింఛన్లు పంపిణీ చేశారు. డాక్టర్ వి.కృష్ణంరాజు, హెడ్ కానిస్టేబుల్ సంజీవరావు ఈ మొత్తం సమకూర్చారు. అలాగే రెండు నిరుపేద కుటుంబాలకు నెలకు సరిపడా బియ్యం, కందిపప్పు, వంటనూనె, కొబ్బరి నూనె,గోధమనూక ఇతర నిత్యావసర సరుకులు అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు గుదే సుశీలా గజేంద్రరావు, చైర్మన్ మస్తాన్‌రెడ్డి, ప్రతినిధులు శీరంశెట్టి గోవిందరావు, గంధోళి నరసింగరావు, పొన్నగంటి కొండలరావు, పిళ్లా శ్రీనివాస్, పూడి నరేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అవార్డు గ్రహీతకు సత్కారం



ఇందిరా ప్రియదర్శినిని సత్కరిస్తున్న గ్రామస్తులు

అగనంపూడి: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, 85వ వార్డు అగనంపూడి బీసీకాలనీ పాఠశాల ఉపాధ్యాయురాలు డి.ఇంది రా ప్రియదర్శినిని సోమవారం పాఠశాల కమిటీ, గ్రామ నాయకులు ఘనంగా సత్కరించారు. వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, నాయకులు ఇల్లపు ప్రసాద్, గరవ సోమశేఖర్, కొరాయి జగదీష్, బలిరెడ్డి సత్యనారాయణ, రాంబాబు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసు దర్యాప్తు వేగవంతం

కూర్మన్నపాలెం: ఉల్లి వ్యాపారిపై జరిగిన హత్యాయత్నం కేసు దర్యాప్తు వేగవంతం చేసినట్టు దువ్వాడ సీఐ కె. మల్లేశ్వరరావు పేర్కొన్నారు. ఇప్పటికే ఎస్ఐ శ్రీనివాసరావు సంఘటనా స్థలికి వెళ్లి వివరాలు సేకరించారని ఆయన తెలిపారు. వ్యాపారి సంతోష్‌పై దాడి చేసిన శ్రీనుపై ఇప్పటికే కేసు నమోదు అయిందని ఆయన పేర్కొన్నారు. నేర తీవ్రతను తెలుసుకోవడానికి కేజీహెచ్ వైద్యుల అభిప్రాయం కోసం లేఖ రాశామన్నారు. లేఖ తమకు అందిన వెంటనే న్యాయవాది సూచనలు మేరకు చర్యలు తీసుకొంటామని సీఐ చెప్పారు. అలాగే తమ సిబ్బంది ఆ ప్రాంతంలో సీసీ పుటేజీ పరిశీలించారని పేర్కొన్నారు. అందులో ముందుగా నిందితుడు శ్రీనుపై వ్యాపారి సంతోష్ చేయి చేసుకున్నట్టుగా తేలిందన్నారు.

17నుంచి మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరాలు

గాజువాక: స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17 నుంచి మహిళల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్టు గాజువాక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు తెలిపా రు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం వచ్చేనెల 2వ వరకు కొనసాగుతుందన్నారు. నియోజకవర్గంలోని అన్ని పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలలో ఈ కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. మహిళలందరూ వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని డాక్టర్ శ్రీనివాస్ కోరారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు లంకెలపాలెం, గంగిరెడ్లకాలనీల్లో రూ.కోటి 25 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులకు సోమవారం పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ స్థానికంగా సమస్యలు ఉంటే అందుబాటులో ఉన్న నాయకుల ద్వారా తనకు తెలియజేయాలన్నారు. వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి ప్రసాద్, నాయకులు దుల్ల రామునాయుడు, గవర సోమశేఖర్, వియ్యపు చిన్న, జెర్రిపోతుల అప్పారావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వైష్ణవ శ్రీకృష్ణ జన్మాష్టమి



ఉయ్యాల సేవలో ఆలయ అర్చకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని సెక్టార్–1 కొండపై ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శ్రీవైష్ణవ శ్రీకృష్ణ జన్మాష్టమి వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి వేకువజామున ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. సాయంత్రం ప్రధానార్చకులు భావనారాయణ స్వామి, అర్చకులు మనోజ్‌స్వామి, హరి వెంకట నారాయణ స్వామి నేతృత్వంలో శ్రీకృష్ణ జననం, అభిషేకం , ద్వాదశార్చన, నివేదన అందజేశారు. అనంతరం మంగళశాసనం, ఊంజల్ సేవ (ఉయ్యాల సేవ)నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అపూర్వ సమ్మేళనం



పూర్వ విద్యార్థుల సందడి

పెదగంట్యాడ: పూర్వ విద్యార్థులు సందడి చేశారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆలింగనం చేసుకుని గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994–95లో పదోతరగతి చదువుకున్న విద్యార్థులు 30 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వుడా కాలనీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం ఆత్మీయ సమ్మేళనంలో కలిశారు. వారికి పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులను కూడా ఆహ్వానించారు. టీచర్లను సత్కరించి అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులంతా అసోసియేషన్‌గా ఏర్పడ్డారు. సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

సిమెంట్ ఫ్యాక్టరీ వద్దని వినతి



తహసీల్దార్ అమలకు వినతిపత్రం అందజేస్తున్న రామచంద్రనగర్ అసోసియేషన్ సభ్యులు

పెదగంట్యాడ: తమ ప్రాంతంలో అదానీ సంస్థ సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయవద్దని రామచంద్ర నగర్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు పెదగంట్యాడ తహసీల్దార్ అమలకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెదగంట్యాడ మండలంలోని ప్రభుత్వ భూమి సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీని కోసం వచ్చే నెల 8న ప్రజాభిప్రాయ సేకరణ కోసం ప్రభుత్వ ఏర్పాట్లు చేస్తోందని దీనిని అడ్డుకుంటామన్నారు. కార్యక్రమంలో భాస్కరరావు, రమణ, మోహన్‌రావు, కమలాకర్‌రావు పాల్గొన్నారు.

కార్మిక, కర్షక పక్షపాతి ఏచూరి



సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

గాజువాక: దివంగత సీపీఎం నేత సీతారాం ఏచూరి కార్మిక, కర్షక పక్షపాతి అని భెల్ సీఐటీయూ నాయకుడు జీటీపీ ప్రకాష్ అన్నారు. భెల్‌వద్ద సోమవారం నిర్వహించిన ఏచూరి ప్రథమ వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. రాజ్యసభ సభ్యుడిగా ఉంటూ కార్మిక సమస్యలపై పార్లమెంట్‌లో తన వాణి వినిపించిన నాయకుడని పేర్కొన్నారు. భెల్‌లో బీహెచ్‌పీవీ విలీనానికి అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్, ఆర్థిక మంత్రి చిదంబరంలను కలిసి ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.జగన్నాథరావు, ఆల్సి అప్పలనాయుడు, సీతన్నాయుడు, అల్లు అప్పారావు, అచ్చన్నాయుడు, మురళీశ్వరరావు, నారపరెడ్డి, ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న ఆలయంలో వైభవంగా శ్రీకృష్ణ జయంతి

- ఘనంగా శ్రీకృష్ణ జననోద్ధారణ పూజలు
- నేడు రాజగోపురం వద్ద ఉట్ల సంబరం



సింహాసనంపై దేవకీదేవిని వేంజేపచేసి శ్రీకృష్ణ జయంతి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై సోమవారం శ్రీకృష్ణాష్టమి ఘనంగా నిర్వహించారు. రాత్రి ఆరాధన అనంతరం ఈ ఉత్సవాన్ని విశేషంగా జరిపారు. ఆండాళ్లమ్మ ఉత్సవమూర్తిని దేవకీదేవిగా అలంకరించి పల్లకిలో వేంజేపచేసి బేడామండపంలో తిరువీధి నిర్వహించారు. అనంతరం దేవకీదేవిని బేడామండపంలో వేంజేపచేసి శ్రీకృష్ణ జననోద్ధారణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. బేడా తిరువీధి అనంతరం ఆస్థానమండపంలో శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవి, ఆళ్వారుల చెంతన బాలకృష్ణున్ని ఉంచి పంచామృతాలతో అభిషేకం చేశారు. విశేష హారతులిచ్చారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు కరి సీతారామాచార్యులు, వేదపండితులు, పారాయణదారులు ఈ ఉత్సవాన్ని జరిపారు. శ్రీ కృష్ణ జయంతి వేడుకల్లో భాగంగా మంగళవారం సాయంత్రం 4.30 గంటల నుంచి ఆలయ రాజగోపురం వద్ద ఉట్ల సంబరాన్ని నిర్వహించనున్నారు.

పరిశోధనలతో ముందుకు సాగాలి

బార్క్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు



విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలతో నివాళులర్పిస్తున్న బార్క్ పీడీ శ్రీనివాసరావు

అగనంపూడి: నేటియువత ఉద్యోగాల కోసం వెంపర్లాడకుండా పరిశోధనలు, నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించి తద్వారా దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని బార్క్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన టెక్నికల్ ఫెస్ట్ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తొలుత ఇంజినీర్స్ డే పురస్కరించుకుని మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, కాలుష్య రహిత పారిశ్రామిక ఉత్పత్తులు, పరిశ్రమలకు ఉపయోగపడేలా పరిశోధనలు సాగించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు మాట్లాడుతూ విద్యార్థులు పుస్తకాలుకే, సిలబస్‌కే పరిమితం కాకుండా విస్తృతమైన సాంకేతిక ప్రపంచాన్ని వినియోగించుకొని మంచి శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. ఫెస్ట్‌లోఉత్తమ ప్రదర్శనలకు నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కన్వీనర్ క్రాంతికుమార్, అధ్యాపకులు, డీన్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పారిశ్రామిక వేత్త ఉషారమణి

కాపు జగ్గరాజుపేటలోని విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ ఇంజనీర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. క్రాఫ్టింగ్ ది ఫ్యూచర్ ఆఫ్ ఇన్నోవేషన్ పేరుతో సాంకేతిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఉత్తమ ప్రదర్శనలకు రూ.50వేల నగదు పారితోషికం అందించారు. అతిథిగా హాజరైన మహిళా పారిశ్రామికవేత్త వి.ఉషా రమణి మాట్లాడుతూ వ్యాపారవేత్తగా తన అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.అరుంధతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు విశ్వేశ్వరయ్య



స్టీల్‌ప్లాంట్‌లో విశ్వేశ్వరయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఉన్నతాధికారులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో సోమవారం ఇంజినీర్స్ డే ఘనంగా నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ ఈడీ (వర్క్స్) బిల్డింగ్ వద్ద జరిగిన కార్యక్రమంలో సీజీఎం (వర్క్స్) రంజన్ మహంతి విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విశ్వేశ్వరయ్య మైసూరులోని కృష్ణరాజు సాగర డ్యామ్ నిర్మాణంలో, హైదరాబాద్‌లో వరద నివారణ చర్యల్లో చీఫ్ ఇంజినీర్‌గా పని చేసి దేశంలోని ఇంజినీర్లకు ప్రేరణగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో ఉన్నతాధికారులు పి. శ్రీనివాస్, యు.ఎన్. బెహరా, డాక్టర్ జి. రమాదేవి, డి. చంద్రశేఖర్, దీపాంకర్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం



విద్యార్థులతో ఉపాధ్యాయులు

పెదగంట్యాడ: భారత రాజ్యాంగం హిందీని అధికార భాషగా గుర్తించిన రోజునే హిందీ దివస్‌గా జరుపుకుంటామని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాచకొండ శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో హిందీ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హిందీ కవుల కలం నుంచి వెలువడిన పలు సాహిత్య విశేషాలను వివరించారు.అనంతరం విద్యార్థులు కవితలు, గేయాలతో హిందీ భాషా ప్రావీణ్యాన్ని ప్రదర్శించారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ నృత్యరూపకాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హిందీ భాషా పండితులు సూర్యకుమారి, రజిని, శాంతకుమారి, శ్యామలావతి, జయలక్ష్మి, రాజ్‌కుమార్, మంగమ్మ, మాధవి, నరసింహ పాల్గొన్నారు.

రజకులకు రక్షణ చట్టం చేయాలి

బీచ్‌రోడ్డు: రజకులకు సామాజిక రక్షణ చట్టం చేయాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సమస్యలపై సోమవారం ధర్నా చేపట్టారు. సంఘం జిల్లా కార్యదర్శి ఎం.ఈశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో వృత్తిదారులు సుమారు 50 వేల మంది ఉన్నారన్నారన్నారు. ధోబీగాట్లు లేవని, లాండ్రీ పని చేయడానికి స్థలాలు లేవన్నారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ), ఏపీ స్టేట్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఎన్ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ సోమవారం తెలిపారు. బ్రాడ్ బాండ్ టెక్నీషియన్ కోర్సులో ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండి 40 ఏళ్లలోపు, పదో తరగతి పాసైన వారు అర్హులన్నారు. మూడు నెలల పాటు శిక్షణ ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు పెదగంట్యాడలోని ఎన్ఏసీ శిక్షణ సంస్థలో సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాలకు 7981022453, 9063269849లలో సంప్రదించాలని సూచించారు.

జీవీఎంసీ ఇంజినీర్లకు సత్కారం



జీవీఎంసీ ఇంజినీర్లను సత్కరించిన మేయర్, డిప్యూటీ మేయర్ ఇతరులు

దాబాగార్డెన్స్: ఇంజినీర్లు దేశ ప్రగతికి పునాది అని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్‌లో జాతీయ ఇంజినీర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని జీవీఎంసీ ఇంజినీర్లను డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డితో కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఇంజినీర్లను గౌరవించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య గొప్ప ఇంజినీరని, దేశాభివృద్ధికి ఆయన చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, పర్యవేక్షక ఇంజనీర్ సంపత్‌కుమార్, కార్యనిర్వాహక ఇంజినీర్లు దిలీప్, మురళీకృష్ణతో పాటు పలువురు ఇంజినీర్లు పాల్గొన్నారు.